



sahanamvande.com

# సహానం వందే


epaper.sahanamvande.com

హైదరాబాద్ | 14-08-2026 శుక్రవారం | సంపుటి-02 సంచిక : 128 EDITOR: ROHINI




# బార్ కౌన్సిల్ బరితెగింపు

## నల్సార్ వర్సిటీ లా విద్యార్థులపై ఉక్కుపాదం




- న్యాయ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పై నిషేధం
- బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఫాసిస్ట్ నిర్ణయం
- సీజేఐ ఆహ్వాన రగడే అందుకు కారణం
- వ్యతిరేకత రావడంతో తోకముడిచిన బార్




**భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ ని స్నాతకోత్సవానికి ఆహ్వానించే విషయంలో హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీలో చెలరేగిన వివాదం వ్యవస్థల ఫాసిస్ట్ పోకడలను బట్టబయలు చేసింది. ప్రశ్నించే గొంతుకలపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏకపక్షంగా రాజ్యాంగ విలువలకు తూట్లు పొడిచిన వైనం, చివరికి తీవ్ర ప్రజా వ్యతిరేకతతో తోకముడిచిన దయనీయ స్థితిపై కథనం ఇది.**

**- సహనం వందే, హైదరాబాద్**

నల్సార్ యూనివర్సిటీ నుంచి పట్టభద్రులయ్యే విద్యార్థులను తదుపరి ఆదేశాలు వచ్చేవరకు న్యాయవాదులుగా నమోదు చేయవద్దంటూ రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా హుటాహుటిన దుర్మార్గపు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా ఈ ప్రచారం వెనుక ఎవరున్నారో గుర్తిస్తూ నివేదిక సమర్పించాలని, ఈ నెల 19న దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని కౌన్సిల్ స్పష్టం చేసింది. వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేలా వ్యవహరించిన ఈ నిర్ణయంపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

### వ్యవస్థల అహంకారం

భవిష్యత్తులో న్యాయవాదులుగా దేశంలో అడుగుపెట్టాల్సిన విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను అడ్డుకోవడం ఫాసిస్ట్ పోకడలను తలపించిందని విద్యార్థి సంఘాలు, మేధావులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేవలం ఒక ఆహ్వానాన్ని పునఃపరిశీలించాలని కోరినందుకు విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి బ్లాక్‌మెయిల్ చేయడం న్యాయ వ్యవస్థల దుందుడుకు ధోరణికి పరాకాష్టగా నిలిచింది. దేశవ్యాప్తంగా నల్సార్ విద్యార్థులకు మద్దతు పెరగడంతో బార్ కౌన్సిల్ కుట్రపూరిత నిర్ణయంపై వ్యతిరేకత అగ్నిలా పెల్లుబికింది.

### ప్రశ్నకు పడిన శిక్ష

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీలో త్వరలో జరగబోయే స్నాతకోత్సవ వేడుకలకు భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉండగా, ఈ ఆహ్వానంపై విద్యార్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ జులై 23న వర్సిటీ వైస్ చాన్సలర్ శ్రీకృష్ణ దేవ రావు, రిజిస్ట్రార్ ఎన్.వాసంతికి ఈ మెయిల్ ద్వారా వినతిపత్రం సమర్పించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు మేరకు జరిగిన ఆందోళనల్లో విద్యార్థులపై పోలీసులు జరిపిన అరాచక దాడులను తప్పుపడుతూ దాఖలైన పిటిషన్‌ను విచారిస్తున్న సమయంలో సీజేఐ చేసిన వ్యాఖ్యలు అత్యంత వివాదాస్పదమయ్యాయి. పిటిషనర్లను ఉద్దేశించి సమయాన్ని వృథా చేసుకోవద్దంటూ ఆయన చేసిన బాధ్యతారహితమైన వ్యాఖ్యలు పోలీసుల దౌర్జన్యాలను వెనకేసుకొచ్చేలా ఉన్నాయని, అలాంటి సంస్కారహీనుడి చేతుల మీదుగా పట్టాలు అందుకోవడం తమ బోధనా విలువలకు పూర్తిగా విరుద్ధమని విద్యార్థులు ఆ ఈమెయిల్‌లో నిర్భయంగా నిలదీశారు. దీంతో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చర్యలకు ఉపక్రమించింది.

### దిగివచ్చిన పెద్దలు

అయితే ఈ నిర్ణయం తమ పరువును బజారుకీడ్చుతుందని గుర్తించిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తోకముడవక తప్పలేదు. నల్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌కు, రాష్ట్ర బార్ కౌన్సిళ్ల కార్యదర్శులకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ జారీ చేసిన ఆదేశాలను వెనక్కు తీసుకుంది. నల్సార్ 2026 బ్యాచ్ విద్యార్థుల్లో ఎక్కువమంది నిర్దోషులని, వారు ఎలాంటి అవమానకరమైన ప్రచారంలో పాల్గొనే ఉద్దేశంలో లేరని యూటర్న్ తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర బార్ కౌన్సిళ్లలో నల్సార్ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై విధించిన నిషేధానికి సంబంధించిన ఆదేశాన్ని కౌన్సిల్ బేషరతుగా సవరిస్తూ దిక్కులేక అధికారిక ప్రకటన విడుదల చేసింది.

### నైతిక సంక్షోభం

ఈ మొత్తం దారుణ ఉదంతంలో విద్యార్థులు, వర్సిటీ యంత్రాంగం, బార్ కౌన్సిల్ మధ్య నడిచిన రాక్షస క్రీడ భారతీయ విద్యా వ్యవస్థల్లో నెలకొన్న అత్యంత భయానక వాతావరణాన్ని కళ్లకు కట్టింది. రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం గొంతెత్తాల్సిన న్యాయ విద్యార్థులు తమ సొంత వర్సిటీలో వేడుకల అతిథుల ఎంపికను ప్రశ్నించడమే నేరంగా పరిగణించే దుస్థితి రావడం ఈ దేశం సిగ్గుపడాల్సిన విషయం. విద్యార్థులు చేసిన ఈమెయిల్ విజ్ఞప్తిని కనీసం గౌరవించాల్సింది పోయి, దానిని ఒక దేశద్రోహ నేరంగా చిత్రించి ఏకంగా వారి జీవితాలను కాలరాసే ప్రయత్నం చేయడం న్యాయ రంగంలో మాయనిమచ్చ.

# ఖర్గేపైనే కుల వివక్ష

## ఆయన కూర్చున్న చోట శుద్ధీకరణ

- కాషాయ మద్దతు కలిగిన సంస్థ నిర్వాకం
- రాజ్యసభలో భగ్గుమన్న నిరసన వెల్లువ
- హల్ద్వానీలో హేయమైన చర్యకు ఖండన
- అధికార పక్షం బేజారు... ఎట్టకేలకు క్షమాపణ



**ఉత్తరాఖండ్ లోని హల్ద్వానీలో కాంగ్రెస్ అగ్రనేత మల్లికార్జున్ ఖర్గే ప్రసంగించిన సభా వేదికను శుద్ధి చేయడమనే హేయమైన కుల వివక్ష చర్య దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవిలో ఉన్న ఒక దళిత నేత అడుగుపెట్టిన చోట పవిత్రత పేరుతో మలినం అంటగట్టేలా ప్రవర్తించిన ఈ అమానుష ఘటనపై పార్లమెంట్ ఉభయ సభల్లోనూ తీవ్ర దుమారం చెలరేగింది. అధికార పక్షాన్ని ఇరుకున పెట్టిన ఈ వివాదంపై ప్రతిపక్షాలు నిప్పులు చెరుగుతుండగా, కేంద్రం దిగివచ్చి విచారణకు ఆదేశించాల్సి వచ్చింది.**

**- సహనం వందే, న్యూఢిల్లీ**

ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఉన్న రామ్‌లీలా మైదానంలో 8వ తేదీన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. ఆయన ప్రసంగం ముగిసిన వెంటనే శ్రీరామ్ సేన వర్గాలు ఆ వేదికపైకి వచ్చి ప్రత్యేకంగా శుద్ధీకరణ పూజలు నిర్వహించాయి. దళిత వర్గానికి చెందిన అగ్రనేత ఆ వేదికపై మాట్లాడారనే దుర్బుద్ధితోనే ఈ నీచమైన కుల అహంకార చర్యకు పాల్పడ్డారని ఉత్తరాఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్ గొడియాల్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ శుద్ధీకరణ వెనుక బీజేపీ అనుబంధ శక్తుల హస్తం ఉందని విపక్షాలు తీవ్రంగా మండిపడ్డాయి.

### రాజ్యసభలో ఖర్గే నిలదీత

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ఆఖరి రోజైన గురువారం రాజ్యసభలో ఈ అంశంపై తీవ్ర వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే తన ఆవేదనను తీవ్ర పదజాలంతో వ్యక్తం చేశారు. తాను ఆ సభలో ఏ మతానికీ వ్యతిరేకంగా మాట్లాడలేదని కేవలం ప్రజా సమస్యల గురించే ప్రస్తావించానని స్పష్టం చేశారు. తాను దళిత సామాజిక వర్గానికి చెందినవాడిననే కారణంతోనే తన ప్రసంగ వేదికపై ఈలాంటి అసహ్యకరమైన శుద్ధి కార్యక్రమాలు నిర్వహించారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగాన్ని కాపాడే పద్ధతి ఇదేనా అని అధికార పక్షాన్ని ఆయన సూటిగా నిలదీశారు.

### దిగొచ్చి క్షమాపణ చెప్పిన అధికార పక్షం

ఖర్గే లేవనెత్తిన ఈ తీవ్రమైన అంశంపై రాజ్యసభలో అధికార పక్షం తరఫున సభా నాయకుడు జేపీ నడ్డా స్పందించారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని ఆయన అంగీకరించారు. భారతీయ జనతా పార్టీ ఇలాంటి కుల వివక్ష చర్యలను ఏమాత్రం ఆమోదించదని తేల్చిచెప్పారు. ఈ ఘటనపై పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తీవ్రంగా పరిగణిస్తారని, పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన సభకు హామీ ఇచ్చారు. ఖర్గేకు, కాంగ్రెస్ పార్టీకి జరిగిన మనోవేదనకు అధికార పక్షం తరఫున ఆయన క్షమాపణలు తెలిపారు.

### అంటరానితనం చట్టం కింద కేసులు

కేవలం క్షమాపణలతో సరిపెట్టకుండా ఈ ఘటనపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని మల్లికార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. హల్ద్వానీలో వేదికను శుద్ధి చేసిన వారిపై కఠినమైన అంటరానితనం నిరోధక చట్టం కింద క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఆయన గట్టిగా కోరారు.

# సెలబ్రిటీల చెత్త ప్రచారం

## డబ్బులకు ఆశపడి అనారోగ్య పుడ్డుకు అండ

- గ్లామర్ ముసుగులో ఘోరమైన దగా!
- సోషల్ మీడియాలో ఇష్టరాజ్యంగా వాగుడు
- ప్రజలను తప్పుదోవ పట్టిస్తే ఇక కఠిన చర్యలు
- ఆహార ప్రచారాలపై ఎఫ్ఎస్ఎస్ఏఐ హెచ్చరిక




**సోషల్ మీడియాలో సెలబ్రిటీలు చెప్పే మాయ మాటలను నమ్మి ప్రజలు అనారోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఈ అవాస్తవ ప్రచారాలపై ఆహార భద్రతా నియంత్రణ సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ ఉక్కుపాదం మోపింది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న తప్పుడు ప్రకటనలకు ముగింపు పలకడానికి కఠినమైన హెచ్చరికలు జారీ చేసింది. - సహనం వందే, న్యూఢిల్లీ**

మనం నిత్యం వాడే స్మార్ట్‌ఫోన్లలో కనిపిస్తున్న ఫుడ్ ప్రకటనల వెనుక పెద్ద మోసమే నడుస్తోంది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో కోట్ల మంది ఫాలోవర్లు ఉన్న సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు డబ్బుల కోసం ఎంతటి విషాన్నయినా అమాయకుల మీదకు వదులుతున్నారు. ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేకపోయినా రోగనిరోధక శక్తిని పెంచుతాయంటూ నూట శాతం స్వచ్ఛమైనవని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ఈ డిజిటల్ ప్రచారాలతో కోట్లాది మంది వినియోగదారులు నిలువునా మోసపోతున్నారు.

### ఎఫ్ఎస్ఎస్ఏఐ హెచ్చరికల మోత

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ దందాలపై ఎట్టకేలకు కన్నెర్రజేసింది. సోషల్ మీడియాలో ప్రచారాలు చేస్తున్న సెలబ్రిటీలకు, ఇన్‌ఫ్లుయెన్సర్లకు గట్టి హెచ్చరికలు జారీ చేసింది. ప్రమోషన్లు చేసే ముందు ఆ ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించాలని తేల్చిచెప్పింది. లేనిపోని అవాస్తవ క్లెయిమ్‌లతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. పెద్ద ఎత్తున ప్రజలను ప్రభావితం చేసే శక్తి ఉన్నప్పుడు బాధ్యత కూడా అలాగే ఉండాలని స్పష్టం చేసింది.

### డబ్బుల కోసం ప్రాణాలతో చెలగాటం

మార్కెట్లో విరివిగా అమ్ముడవుతున్న హెల్త్ డ్రింక్స్, ప్రోటీన్ సప్లిమెంట్స్, స్నాక్స్, ప్యాకేజ్డ్ ఫుడ్స్‌ను నమ్మి ప్రజలు అనారోగ్యం కొనితెచ్చుకుంటున్నారు. సెలబ్రిటీల మీద ఉన్న నమ్మకంతో ప్రజలు ఈ వస్తువులను గుడ్డిగా కొనుగోలు చేస్తున్నారు. ఇమ్యూనిటీ బూస్ట్ అని, పోషకాలు నిండి ఉన్నాయని చెప్పే మాటలన్నీ బూటకమని తేలిపోతోంది. ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేకుండా ప్రసారమయ్యే ఇలాంటి ప్రకటనలు సమాజానికి పెను ముప్పుగా మారుతున్నాయి.

### డాబర్ ఇండియాపై ఉక్కుపాదం...

నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు ప్రకటనలు ఇస్తున్న కంపెనీలపై ఫుడ్ సేఫ్టీ రెగ్యులేటర్ ఇప్పటికే కొరడా ఝుళిపించింది. డాబర్ ఇండియా సంస్థకు వ్యతిరేకంగా నిషేధ ఆజ్ఞలను జారీ చేసింది. తేనె, ఆపిల్ సైడర్ వెనిగర్, వర్జిన్ కోకనట్ ఆయిల్, నువ్వుల నూనె, ఆవు నెయ్యి, కొబ్బరి నీరు, కొబ్బరి పాలు వంటి ఉత్పత్తులపై నూట శాతం స్వచ్ఛమైనవంటూ చేస్తున్న ప్రచారాన్ని తప్పుపట్టింది.

### పరిశుభ్రత లేని ఫుడ్ అవుట్‌లెట్లు

కేవలం ప్రకటనలే కాకుండా తయారీ కేంద్రాలలో జరుగుతున్న మోసాలపై కూడా చర్యలు జోరందుకున్నాయి. లోవాలాలోని మాగ్రో సంస్థ పరిశుభ్రతా ప్రమాదాలు, నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ స్క్రీనింగ్‌లో దొరికిపోయింది. సంస్థకు వ్యతిరేకంగా తక్షణ నోటీసులు జారీ అయ్యాయి. ప్లాస్టిక్ ప్యాకేజింగ్ వలన కలిగే ముప్పును గుర్తించి పాన్ మసాలా వంటి వస్తువులకు ప్లాస్టిక్ నిషేధించి పేపర్, టిన్ వాడాలని ఆదేశాలు జారీ చేశారు. డిజిటల్ మాధ్యమాల్లో జరిగే మోసాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చింది.